

మిరపపై తెగుళ్ల దాడి



రుద్రవరం మండలం ఆలమూరులో సాగు చేసిన మిరప తోట

రుద్రవరం, సెప్టెంబరు 2 :

ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోరుబావుల కింద రైతులు మిరప పంటను సాగు చేశారు. ఒక ఎకరా మిరప సాగుకు రూ.లక్ష పెట్టుబడి పెట్టారు. అయినా ప్రకృతి దాడిలో రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. మిరప పంటపై ఎర్ర తెగులు, బింగి తెగులు, తామర పురుగుల దాడి అధికమైందని రైతుల ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో 25వేల ఎకరాల్లో మిరప సాగు లక్ష్యంగా ఉండగా సుమారు 10వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు.


మిరపకు తెగుళ్లు, తామర పురుగుల దాడి

రైతులు మిరప పంట సాగు చేసి 60 నుంచి 90 రోజులు కావస్తోంది. కోతకు వచ్చే సమయంలో మిరపపంటకు ఎర్రతెగుళ్లు, బింగి తెగుళ్లు, తామరపురుగుల దాడి అధికంగా ఉంది. ఎన్నిమందులు పిచికారి చేసినా తెగులు, తామర పురుగుల దాడి తగ్గడం లేదు. పంట చేతికందుతున్న సమయంలో ఉధృతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కంటికి రెప్పలా కాపాడుకున్న మిరప పంట తామర పురుగుల దాడి చేయడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుంది. తెగుళ్ల దాడితో మిరప మొక్కలు ఎదుగుదల నిలిచిపోయింది. ఇలా ప్రకృతి దాడిలో రైతులు నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



తెగులు సోకిన మిరప మొక్క





రైతన్న దిగాలు

అప్పు చేసి పంట సాగు చేసి 60 నుంచి 90 రోజులు కావస్తోంది. దిగుబడి చేతికందే సమయంలో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని గుండెలు బాదుకుంటున్నారు. మిర్చికి రేటు బాగుందని పెట్టుబడి పెడితే, ఆ రేటు కనీసం వారం రోజులు కూడా లేకుండా పతనమైందని, మిరప సాగు చేయాలంటే భయమేస్తున్నదని రైతులు అంటున్నారు.

ఎకరాకు లక్ష పెట్టుబడి

ఒక ఎకరా మిరప సాగు చేయడానికి రైతులు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టారు. తెగుళ్ల, పురుగులు పంటను నమిలేస్తున్నాయి. మిరప సాగులో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప కాయలు కోసేందుకు కూలీ రూ.300 నుంచి రూ.320 చెల్లించాల్సి వస్తుంది.



తెగులు సోకిన మిరప పంటను చూపుతున్న రైతు

- తగ్గిన దిగుబడి
- ఎకరాకు రూ.లక్ష దాకా పెట్టుబడి
- 10వేల ఎకరాల్లో సాగు
- భారీగా ధర పతనం
- పెట్టుబడి కూడా రాదని రైతుల ఆందోళన

జిల్లాలో మిర్చి సాగు 25వేల ఎకరాలు లక్ష్యం

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 25వేల ఎకరాల్లో మిరప సాగు లక్ష్యంగా ఉంది. ప్రస్తుతం సుమారు 10వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఈ మిరప పంట సాగు 60 రోజుల నుంచి 90 రోజుల వరకు కావచ్చింది. సాగు విస్తీర్ణం ఇంకా పెరగవచ్చని అధికారులు అంచనా.

మిర్చి ధర పతనం: 50 కేజీల మిర్చి బస్తా రూ.2400 నుంచి రూ.1100కు పడిపోయింది. 50 కేజీల బస్తా రూ.2400 ఉందని ఎంతో ఆశతో పెట్టుబడి పెట్టామని, తీరా పంట దిగుబడి వస్తున్న సమయంలో ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

ఎకరాకు లక్ష పెట్టుబడి పెట్టాం



ఒక ఎకరా మిరప పంట సాగు చేయడానికి లక్ష రూపాయలు పెట్టాం. సాగు చేసి 90 రోజులు పూర్తయింది. పంట దిగుబడి వస్తున్నా ధర పతనం కావడంతో నష్టపోవాల్సి వస్తోంది.

-అఫ్సర్, రైతు, ఆలమూరు

తెగుళ్ల దాడితో నష్టం



మిరప పంట సాగు చేసి 75 రోజులు అయింది. ఒక్క కోత కూడా కోయలేదు. ఒక వైపు ఎర్ర, తెగుళ్ల, మరో వైపు తామర పురుగుల దాడితో మిరప మొక్కలలో ఎదుగుదల నిలిచింది. ఇప్పటి వరకు రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టా.

- నాగేశ్వర్‌రావు, రైతు, ఆలమూరు

తెగుళ్లదాడి అధికం



మిరప పంటకు తెగుళ్ల దాడి అధికంగా ఉంది. రెండు ఎకరాల్లో మిరప పంట సాగు చేసి 60 రోజులు అయింది. అప్పుడే తెగుళ్ల దాడి అధికమైంది. ఒక్కో ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టాం.

-నరసింహ, రైతు, నాగలవరం

మిరపలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మిరప పంటలో సస్యరక్షణ చర్యలు రైతులు చేపట్టాలి. ఒక లీటరు నీటికి మెగ్నీషియంసల్ఫర్ 5 గ్రాములు కలిపి, 13.0.45 మూడు గ్రాములు లీటరుకు కలిపి పిచికారి చేయాలి.

- శ్రీధర్, ఉద్యానశాఖాధికారి

వాగులు, వంకల వద్ద నిఘా

- పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయండి
- పంట నష్టంపై ప్రాథమిక నివేదికలు ఇవ్వండి: కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 2: భారీ వర్షాలతో బ్రిడ్జిలపై ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద గట్టి నిఘా పెట్టాలని, రాకపోకలకు అనుమతించవద్దని కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్లో పీజీఆర్ఎస్ వేదికలో భాగంగా భారీవర్షాలు, పీజీఆర్ఎస్, సంక్షేమ హాస్టళ్లు, పనితీరు, ఈ-పంట, పారిశుధ్యం, రక్షిత మంచినీటి సరఫరా తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నల్లమల్ల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల వల్ల శ్రీశైలం, నందికొట్కూరు. నియోజకవర్గాలలోని అన్ని మండలాలలో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయని అన్నారు. నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటికి పంపేందుకు చర్యలు తీసుకుంటూ.. అక్కడి ప్రజానీకానికి అధికారులు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు, పండ్లతోటలు, పశునష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తుఫాను బాధితుల వివరాలతో నివేదికలు తయారు చేయండి:ఎమ్మెల్యే గౌరు

పాణ్యం, సెప్టెంబరు 2 : అధికారులు తుఫాను సహాయక చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో భారీ వర్షాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలు, రహదారులు, గృహాలు, నష్టపోయిన బాధితుల వివరాలు వెంటనే విచారించి నివేదికలు తయారు చేయాలన్నారు. ముఖ్యంగా మురుగునీటి నివారణ, తాగునీటి శుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలతో పాటు పశువులకు అవసరమైన పశుగ్రాసం, వ్యాధులపై పశువైద్యాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలోని సమస్యలను ప్రతిరోజూ కార్యదర్శులు గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నారాయణమ్మ, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలు శుభ్రంగా ఉంచుకోవాలి : పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలోని మురుగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని తహసీల్దారు, ఎంపీడీఓను ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పంట నష్టంపై నివేదిక పంపండి

కలెక్టర్‌ను ఆదేశించిన మంత్రి బీసీ



నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 2: జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో జరిగిన పంట, ఆస్తి నష్టంపై నివేదికలు పంపాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లాలో కురుస్తున్న వర్షాలపై మంత్రి టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలో వర్షాలవల్ల దెబ్బతిన్న పంటలు, రోడ్లు, శిథిలావస్థలో ఉన్న మట్టి మిద్దెలు, పారిశుధ్య చర్యలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్టాన్ని అంచనావేసి వాస్తవ నివేదికలు అందజేయాలని మంత్రి ఆదేశించారు. భారీ వర్షాలకు 11,238 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వర్షాలకు గ్రామాలలో 6 పక్కా ఇళ్లు పూర్తిగా, 43 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. పాములపాడు మండలం వేంపెంట గ్రామంలో డయేరియా కేసులు పెరగకుం డా 24 గంటల పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని మెడికల్ అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలో కుందూ, మద్దిలేరు, పాలేరు వాగుల ప్రవాహాలను ఎప్పటికప్పుడు, పరిశీలిస్తూ పరివాహక ప్రాంతాల్లో మునిగిన పంటల నష్టాన్ని అంచనా వేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వరదల వల్ల ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాలతో దెబ్బతిన్న రహదారుల వివరాలను సేకరించి నివేదికలు ఇవ్వాలని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, అధికారులను మంత్రి ఆదేశించారు. దోమల నివారణ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకుంటూ పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎద్దులేరులో కొనసాగుతున్న వరద

కొత్తపల్లి, సెప్టెంబరు 2: ఎడతెరపి లేకుం డా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కు కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామ శివారులో ఉన్న ఎద్దులేరు వాగుకు సోమవారం కూడా వరద ఉధృతి కొనసాగింది. మూడు రోజులుగా 20 గ్రామాలకు పైగా జనజీవనం స్తంభించిపోయింది. కొందరు ప్రమాదం అని తెలిసినప్పటికీ గత్యంతరం లేక తాడు సాయంతో అతికష్టం మీద ఎద్దులేరు వాగు దాటుతున్నారు. గ్రామ వీధుల్లో అపరిశుభ్రత నెలకొనడంతో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్య దుద్యాల, నందికుంట గ్రామాల్లో నీట మునిగిన గృహాలను, ఉప్పొంగి ప్రవహిస్తున్న ఎద్దులేరు వాగును పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.



శివపురం ఎద్దులేరు వాగును తాడు సాయంతో దాటుతున్న ప్రజలు

సమస్యలను పరిష్కరించండి : ఎస్పీ



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, సెప్టెంబరు 2: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలపై అధికారులు చట్టపరిధికి లోబడి సత్వర పరిష్కారం చూపాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో సమస్యలను తెలుసుకున్నారు. అర్జీదారులనుంచి వినతిపత్రాలు స్వీకరించి సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. సమస్య తీవ్రతను వివరించి చట్టపరిధిలో పరిష్కారం చూపాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, ఒకసారి వచ్చిన సమస్య మళ్లీ రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమస్యలు, ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సివిల్ తగాదాలు, అత్తవారింటి వేధింపులు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో మనస్పర్థలు తదితర అర్జీలు ఉన్నాయి.

వంద టీఎంసీలకు చేరువలో తుంగభద్ర

- 98.961 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- డ్యాంకు చేరుతున్న 37,100 క్యూసెక్కులు



నిండుకుండలా కనిపిస్తున్న తుంగభద్ర డ్యాం

కర్నూలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం వంద టీఎంసీలకు చేరువలో ఉంది. సోమవారం రాత్రి 9 గంటల నీటి లెక్కలు ప్రకారం జలాశయంలో 98.961 టీఎంసీలు నీటి నిల్వ చేరింది. 37,100 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. మంగళవారం ఉదయానికి వంద టీఎంసీలు దాటుతుందని తుంగభద్ర ప్రాజెక్టు ఇంజనీర్లు అంచనా వేశారు. ఆగస్టు 10న డ్యాం గేట్ల దింపుతుండగా 19వ నంబరు గేటు చైన్‌లింగ్ తెగిపోయి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో డ్యాంలో 105.788 టీఎంసీలు నిల్వ ఉంది. కొట్టుకుపోయిన గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఏర్పాటు చేయాలంటే క్రస్ట్ లెవల్ 1,613 అడుగుల లెవల్ వరకు డ్యాంను ఖాళీ చేయక తప్పదని టీబీ బోర్డు ఇంజనీర్లు భావించారు. క్రస్ట్ లెవల్‌లో 43 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంటుంది. అంటే 62.788 టీఎంసీలు వదిలేయాల్సి వచ్చింది. అదే జరిగి ఉంటే నిత్యం కరువుతో తల్లడిల్లే రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాల ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చేది. ఆ సమయంలో క్రస్ట్‌గేట్ల నిపుణుడు ఎస్.కన్నయ్యనాయుడును సీఎం చంద్రబాబు రంగంలోకి దింపారు. చంద్రబాబు ఆదేశాల మేరకు టీబీ ప్రాజెక్టుకు చేరుకున్న కన్నయ్యనాయుడు బోర్డు ఇంజనీర్లతో చర్చించారు. 72 టీఎంసీలు నీటి నిల్వ కుండగానే స్టాప్‌లాక్ ఎలిమెంట్ సెగ్మెంట్లు దిగ్విజయంగా అమర్చారు. సుమారు 30 టీఎంసీలు కడలిపాలు కాకుండా కాపాడి రైతుల్లో సాగు భరోసా కల్పించారు. ఆ రోజు నుంచి డ్యాంకు రోజు సగటున 25-30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతూ వచ్చింది. తాజాగా 98.961 టీఎంసీలకు చేరింది. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో 26,272 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.ఎగువన కురుస్తున్న వర్షాలకు క్రమక్రమంగా వరద పెరుగుతూ వస్తోంది. రాత్రి 9 గంటలకు 37,100 క్యూసెక్కులకు చేరింది. అంటే సరాసరి 3 టీఎంసీలు వచ్చి చేరుతోంది. వివిధ కాలువలు, విద్యుత్ ఉత్పత్తి కోసం 15,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇదే వరద ఇలాగే కొనసాగితే బుధవారం సాయంత్రంలో గేట్లెత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు, టీబీపీ బోర్డు అధికారులు సకాలంలో స్పందించడంతో గేటు కొట్టుకుపోయినా.. ఖరీఫ్, రబీ సాగుతో పాటు తాగునీటికి ఇబ్బంది లేకుండా చేశారు.

సాగు ఆశలు పదిలం

ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులు చంద్రబాబు, సిద్దరామయ్య సహా క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, టీబీపీ బోర్డు అధికారులు సకాలంలో స్పందించడం వల్ల ఖరీఫ్, రబీ సాగుతో పాటు తాగునీటికి తీరినట్లుఅయింది. రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాలకు చెందిన తుంగభద్ర కుడి దిగువ కాలువ (ఎల్లెల్సీ), ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1.57 లక్షల ఎకరాలక సాగునీరు ఇవ్వాలి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 35 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని ఐఏబీలో తీర్మానం చేశారు. అనంతపురం, కడప జిల్లాల్లో హెచ్చెల్సీ కింద 1.90 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. రైతులు వరినాట్లలో బిజీగా ఉన్న సమయంలో ఈ నెల 10న తుంగభద్ర డ్యాం 19వ నంబరు గేటు కొట్టుకుపోవడంతో సాగు మాట ఎలా ఉన్నా రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవని ఆందోళన చెందారు. కష్ట సమయంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సూచన మేరకు క్రస్ట్‌గేట్ల నిపుణుడు ఎస్.కన్నయ్యనాయుడు రంగంలోకి దిగి స్టాప్‌లాగ్ ఎలిమెంట్ సెగ్మెంట్లను సకాలంలో ఏర్పాటు చేయడం కరువు రైతుల సాగు ఆశలు పదిలం చేశారు.



తుంగభద్ర డ్యాం

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 2: జిల్లా కేంద్రంలో పీజీఆర్ఎస్ వ్యవస్థను పటిష్టం చేశామని, ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచిఅర్జీలను స్వీకరించారు. మొత్తం 76 అర్జీలు వచ్చినట్లు డీఆర్వో పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమామహేశ్వరి తెలిపారు.

పారా మెడికల్ కౌన్సెలింగ్ పూర్తి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 2: 2024-25 విద్యాసంవత్సరం పారా మెడికల్ కోర్సులకు అడ్మిషన్ కౌన్సెలింగ్ సోమవారం పూర్తి చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ వెల్లడించారు. సోమవారం కాలేజీలోని ఆడిటోరియంలో కౌన్సెలింగ్‌కు వందలాది మంది హాజరు కాగా 121 మందికి అడ్మిషన్ ఇచ్చినట్లు తెలిపారు. పారా మెడికల్ కోర్సులకు సంబంధించి పది కోర్సుల సీట్లను మెరిట్, రోస్టర్ ప్రకారం భర్తీ చేశామన్నారు. కోర్సుల్లో సీట్లు పొందని విద్యార్థులు ఏ కారణం చేతనైనా ఫీజు చెల్లించకపోతే సదరు సీట్లను ఈ నెల 9వ తేదీన జరిగే రెండో కౌన్సెలింగ్‌లో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కౌన్సిలింగ్‌లో వైస్ ప్రిన్సిపాల్స్ హరిచరణ్, సాయిసుధీర్, మెడికల్ కాలేజీ ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఏవో లక్ష్మీప్రసన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో మహిళా రైతు మృతి



బాలమ్మ (ఫైల్)

తుగ్గలి, సెప్టెంబరు 2: ఏటా పంటలు సాగు చేసి అతివృష్టి, అనావృష్టి వల్ల అప్పులపాలై తీవ్ర మనోవ్యథతో రామవత్ బాలమ్మ (42) అనే మహిళా రైతు గుండెపోటుతో మృతి చెందింది. తుగ్గలి మండలంలోని జొన్నగిరి తండాకు చెందిన మహిళా రైతు రమావత్ బాలమ్మ సోమవారం ఉదయాన్నే పొలానికి వెళ్లి .. మిరప, టమోటా పంట వర్షానికి కుళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఆమె ఇంటికి వచ్చి గుండెపోటుతో కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు గుత్తి ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. కుటుంబ పోషణ కోసం తనకున్న రెండెకరాలు పంటతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని మిరప, టమోటా, కంది, సజ్జ పంటలను బాలమ్మ సాగు చేసింది. గత ఐదేళ్ల నుంచి ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట చేతికి రాక దాదాపు రూ.34 లక్షలు అప్పులయ్యాయి. దీంతో గుండెపోటు వచ్చి మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త వెంకటేశ్‌నాయక్, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు వెంకటస్వామి, చంద్రశేఖర్‌యాదవ్, జడ్పీటీసీ పులికొండ నాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నారాయణ నాయక్, టూకే నాయక్, లాలూ నాయక్, వెంకటేశ్ నాయక్ ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పి.కోటకొండలో...



గిడ్డయ్య (ఫైల్)

దేవనకొండ, సెప్టెంబరు 2 : అప్పుల భారంతో మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన మునగాల గిడ్డయ్య (31) పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మునగాల గిడ్డయ్య తనకున్న పొలంలో బోర్లు వేసి, మరికొంత పొలాన్ని కౌలుకు సాగు చేసేవాడు. పంటలు పండకపోవడంతో రూ.6 లక్షల దాకా అప్పులు పెరిగాయి. అప్పులు తీర్చే మార్గం కనపడక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య జయసుధ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కర్నూలు, సెప్టెంబరు 2: నగరంలో జోన్ రహదారిలో ఐటీసీ కూడలి ఫ్లైఓవర్ సమీపంలో మోటారు సైకిల్ ఢీకొని శాంతమ్మ (55) అనే మహిళ దుర్మరణం చెందింది. షరీన్‌నగర్‌కు చెందిన ఈమె పలు ఇళ్లలో పని చేస్తూ జీవనం సాగిస్తుండేది. ఈమెకు భర్త, ఇద్దరు కొడుకులు సంతానం. సోమవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఐటీసీ కూడలి వద్ద ఫ్లైఓవర్ దాటేందుకు ప్రయత్నించగా.. వేగంగా వచ్చిన మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు వెల్దుర్తి మండలం చెందిన హరికుమార్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 2: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 6వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 3,154 మందికి గాను 1,635 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని అధికారులు తెలిపారు. పరీక్షల రీవాల్యూయేషన్ కోసం ఈనెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ రంజిత్ బాషా



జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2: నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జాబ్‌మేళా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని మంగళవారం బిర్లాగేటు వద్ద బి.క్యాంపు పోస్టాఫీసులోని నాక్ సెంటర్‌లో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఐదు ప్రైవేటు కంపెనీల్లో 350 ఖాళీలను భర్తీ చేస్తారన్నారు. అదేవిధంగా ఆలూరులో కూడా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనాలనుకునే యువకులు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి కర్నూలులో ప్రశాంత్ 81424 10410, మల్లికార్జున 90592 90821, ఆలూరులో వీరేష్ 90100 03132 నంబర్లను సంప్రదించాలన్నారు.

కిడ్నాప్ కేసులో ముగ్గురిపై రౌడీ షీట్

గూడూరు సెప్టెంబరు 2: గూడూరులో పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెలలో డమాం వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసిన కేసులో బోయ కొండయ్య, గాండ్ల నరసింహుడు అలియాస్ మున్నా, కటిక మహబూబ్ బాషాపై రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. సోమవారం గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మయ్య మాట్లాడుతూ ఎస్పీ ఉత్తర్వుల మేరకు కిడ్నాప్ కేసులో ముగ్గురిపై రౌడీ షీట్ ఓపెన్ చేసామన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కూడా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

పంటల దిగుబడిలో అధికారుల సూచనలు తీసుకోవాలి

శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి



మిరప పంటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి

మద్దికెర, సెప్టెంబరు 2: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు ఆశిస్తున్న తెగుళ్ల చీడపీడల నివారణకు అధికారుల సూచనలు తీసుకోవాలని కృషి విజ్ఞాన శాస్త్రవేత్త ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. రాఘవేంద్ర చౌదరి తెలిపారు. సోమవారం మండలంలోని మద్దికెర, బీఎం పేట గ్రామాల్లో మిరప, పత్తి, కంది, సజ్జ, వేరుశనగ, వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ పత్తి పంట నీటి ముంపునకు గురైనప్పుడు, పిందెలు, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబారడం, పడిపోవడం జరుగుతుందని అప్పుడు ఆ సమయంలో పొటాషియం, నైట్రేట్ యూరియాలో కలిసి వారంరోజుల వ్యవధిలో మార్చిమార్చి పిచికారి చేయాల న్నారు. ఎకరాకు 30 కిలోల యూరియా పొటాష్ ఎరువుగా వేయాలన్నారు. మిరప పంటలో వర్షం నీరు నిల్వ ఉంటే నారుకుళ్లు, తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని, అందువల్ల మందులు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త సుజాత, మండల వ్యవసాయ శాఖ అధికారి ఉప్పర రవి, ఆర్‌బీకే ఇన్‌చార్జిలు వై. రాణి, ఎం.కవిత, ఎం.జాకీర్ హుశేన్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌గా కర్నూలు జట్టు కైవసం



గెలుపొందిన కర్నూలు క్రీడాకారులు

కోసిగి, సెప్టెంబరు 2: కోసిగి మండలంలోని డి.బెళగల్ గ్రామంలో విజేత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి రాష్ట్ర స్థాయి అండర్-17 ల్యాక్రోస్ చాంపియన్‌షిప్‌ను కర్నూలు జిల్లా జట్టు కైవసం చేసుకుంది. విజేతలకు షీల్డ్స్, మెడల్స్ సర్టిఫికెట్లను రాష్ట్ర ల్యాక్రోస్ క్రీడల అసోసియేషన్ అధ్యక్షుడు మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి అందజేశారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి జాతీయ స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. అండర్-17 పోటీల్లో కర్నూలు జిల్లా చాంపియన్‌గా, రన్నర్‌గా ప్రకాశం జిల్లా, మూడో స్థానంలో విజయనగరం, నాలుగో స్థానంలో శ్రీకాకుళం జిల్లా జట్లు నిలిచాయి. ఈ పోటీలను నిర్వహించిన హై స్కూల్ పీడీ శివను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మరామయ్య, ఉప సర్పంచ్ పాండురంగ, సోల్మాన్ రాజు, ప్రభాకర్ రెడ్డి, ఉశేనీ, నాగరాజు, రాజశేఖర్ రెడ్డి, బసవరాజు, సీతారాముడు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉరుకుంద పల్లకోత్సవం

తుంగభద్రలో త్రిశూల స్నానం



పల్లకోత్సవంలో పాల్గొన్న భక్తులు

కౌతాళం/కోసిగి, సెప్టెంబరు 2: ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాస పల్లకోత్సవం చివరి సోమవారం వైభవంగా కొనసాగింది. తెల్లవారుజామున కోసిగి మండలం కందుకూరు వద్ద తుంగభద్ర నదిలో స్వామి వారికి జలాభిషేకం చేసిన తరువాత అక్కడి నుంచి ఉరుకుందకు తిప్పలదొడ్డి, కరణి, చిరుతాపల్లి, మల్లనహట్టి గ్రామాల మీదుగా ఉరుకుందకు పల్లకి చేరుకుంది. గ్రామ పొలిమేరకు పల్లకి చేరుకోవడంతో ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు ఆలయ అర్చకులతో కలసి పూర్ణకుంభ స్వాగతం పలికారు. కర్ణాటక నుంచి వచ్చిన డప్పు కళాకారుల బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి వారి పల్లకి ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్రల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ వేడుకల్లో ఈఓ పట్టెం గురుప్రసాద్, ఉత్సవ అధికారి పాండురంగారెడ్డి పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోసిగి సీఐ అశోక్ కుమార్, కౌతాళం ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కాలుజారి బావిలో పడి మహిళ మృతి

గౌడుగల్లులో ఘటన

కోసిగి, సెప్టెంబరు 2: అప్పటి వరకు పొలంలో ఉల్లిగడ్డలు తెంపుతూ ఉన్న మహిళ మహాదేవి మంచి నీరు తేవడానికి వ్యవసాయ బావిలో దిగి కాలుజారి పడిపోయి మృతి చెందింది. కోసిగి మండల పరిధిలోని గౌడుగల్లు గ్రామానికి చెందిన కిందింటి మహాదేవి (25) తన పొలంలో భర్త రామకృష్ణతో కలిసి కుమారులు మధు, ఆనంద్, కుమర్తె రోజాతో కలిసి ఉల్లి పంటను లోడింగ్ చేసే పనిలో ఉంటూ కూలీలకు తాగునీరు తేవడానికి వెళ్లి కాలుజారి పడి బావిలోపడి మృతి చెందింది. అరగంట గమనించిన కుటుంబసభ్యులు ఆమెను బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు.

నాపరాయి లారీ సీజ్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 2: బేతంచర్ల నుంచి మహరాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న నాపరాయి లారీని సీజ్ చేసి రూ.40 వేలు జరిమాన వసూలు చేసినట్లు గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఉదయం నన్నూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీల్లో అక్రమంగా నాపరాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. దీంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని యజమానికి జరిమాన విధించామని తెలిపారు.

కల్లూరు వీఆర్వో మద్దిలేటి రిలీవ్

కల్లూరు, సెప్టెంబరు 2: కల్లూరు వీఆర్వో మద్దిలేటిని విధుల నుంచి రిలీవ్ చేసినట్లు తహసీల్దారు కె.ఆంజనేయులు సోమవారం తెలిపారు. అవినీతి అక్రమాలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆయనపై ఇటీవల కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వీఆర్వో మద్దిలేటిని దేవనకొండ మండలం తెర్నేకల్-2 గ్రామానికి బదిలీ చేస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కల్లూరు వీఆర్వో మద్దిలేటిని తహసీల్దారు రిలీవ్ చేశారు.

విజయవాడకు ఉమ్మడి జిల్లా పోలీసులు

బయల్దేరిన నంద్యాల, కర్నూలు ఎస్పీలు

వారితో పాటు మరో 240 మంది పోలీసులు

కర్నూలు, సెప్టెంబరు 2: విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా ఎస్పీ బిందు మాధవ్, అధిరాజ్ సింగ్ రాణాలు సోమవారం మధ్యాహ్నం నుంచి బయలుదేరి విజయవాడకు వెళ్లారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సహాయక చర్యల్లో పాల్గొనేందుకు కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో నలుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, మరో 40 మంది ఎస్ఐలు, వంద మంది పైగా పోలీసు సిబ్బంది విజయవాడ వెళ్లారు. వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా వైద్యాధికారి భాస్కర్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 2: భారీ వర్షాల నేపథ్యంలో వైద్యఆరోగ్యశాఖలో అత్యవసర వైద్యం, విపత్తు కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌కు నోడల్ ఆఫీసర్‌గా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ (9849902411) వ్యవహరిస్తారన్నారు. సభ్యులుగా ఏపీడమాలజిస్టు జి.వేణుగోపాల్ యాదవ్ (9440084009), డిస్ట్రిక్ట్ మలేరియా ఆఫీసర్ ఏ.నూకరాజు (9849902419), అసిస్టెంట్ మలేరియా అధికారి సీహెచ్ చంద్రశేఖర్ రావు (9949494366), ఎంపీహెచ్ఈవో చలపతిరావు (7569792365), హెల్త్ సూపర్‌వైజర్ మోక్షేశ్వరుడు (8919190259) కమిటీలో ఉంటారన్నారు. ఆపదలో ఎవరికైనా అత్యావసర వైద్యం కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేస్తుందన్నారు.

తెగుళ్ళ నివారణకు పిచికారి చేయాలి

నంద్యాల టౌన్, సెప్టెంబరు 2 : జిల్లాలో ఎడతెరపి లేని వర్షాల వల్ల తెగుళ్లబారిన పడ్డ పంటలకు పిచికారీ చేయాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం జాన్సన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలని అన్నారు. వర్షాలు తగ్గాక మూడు, నాలుగు రోజుల తరువాత వరుసల మధ్య భాగాన్ని గుంటికతో గానీ, గొర్రుతో గానీ సేద్యం చేయాలని సూచించారు. ఎకరానికి 50 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని, అలాగే 13:0:45, 19:19:19 మందులను 10 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు. డ్రోన్లను ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసే అవకాశం ఉందని అన్నారు.

భర్త మృతిని జీర్ణించుకోలేక..

మహిళ ఆత్మహత్య

శిరివెళ్ల, సెప్టెంబరు 2 : భర్త మృతిని జీర్ణించుకోలేక భార్య ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన శిరివెళ్ల మండలం వనికెందిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జిలకర అశోక్ తిరుపతిలో జీవనం సాగిస్తుండేవాడు. ఐదు రోజుల కిందట అశోక్ గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన వనికెందిన్నెకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. భర్త మరణాన్ని జీర్ణించుకోలేక.. తీవ్ర మనస్తాపానికి గురైన భార్య శాంతి(40) ఆదివారం అర్ధరాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వారం రోజుల వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ మృతి చెందడంతో వారి కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శాంతి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి కనక రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద



నిండుకుండలా కనిపిస్తున్న శ్రీశైలం జలాశయం

శ్రీశైలం, సెప్టెంబరు 2: శ్రీశైలం జలాశయానికి సోమవారం వరద ప్రవాహం భారీగా కొనసాగింది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 3,20,805 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 4,479 క్యూసెక్కులు మొత్తం 3,25,284 వరద నీరు వస్తోంది. డ్యాం 10 క్రస్టుగేట్లను ఎత్తి 4,71,730 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 7 గంటల సమయానికి జలాశయానికి 4,96,554 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.10 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 210.5133 టీఎంసీలుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,903 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కులు, డ్యాం క్రస్టుగేట్ల ద్వారా 4,71,730 క్యూసెక్కులు మొత్తం 5,39,515 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

గోస్పాడు, సెప్టెంబరు 2: కుందూనది పరివాహక గ్రామాలైన రాయపాడు, తెళ్ళపూరు, కూలూరు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రాయపాడు -తెళ్ళపూరి గ్రామాల మధ్య ఉన్న కుందూనది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన ఎస్పీ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కుందూనది కుందూనది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న ఎస్‌ఐ వెంకట ప్రసాద్, తెళ్ళపూరి గ్రామ టీడీపీ నాయకుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డిలతో మాట్లాడి ప్రజలను అప్రమత్తం చేయాలని, నీటి ప్రవాహ ఉధృతి ఎక్కువ అయితే వెంటనే జిల్లా అధికారులకు తెలియజేయాలని అన్నారు.

ప్రజలకు అవగాహన

కొత్తపల్లి, సెప్టెంబరు 2: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని నందికుంట బస్టాండు సెంటరులో ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి స్థానిక ఎస్‌ఐ కేశవులతో కలిసి ప్రజలతో సమావేశం నిర్వహించారు. పోలీసు సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం


కలెక్టర్‌కు చెక్కును అందిస్తున్న విద్యావతి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 2: రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వరద బాధితుల సహాయార్థం జంబులయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ వర్ధంశెట్టి విద్యావతి ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. లక్ష విరాళం అందించారు. చెక్కును సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ రాజకుమారికి అందజేశారు.

'ట్రాక్టర్లను సద్వినియోగం చేసుకోవాలి'

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 2: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి మంజూరు చేసిన యంత్ర పరికరాలను, ముఖ్యంగా ట్రాక్టర్లను పారిశుధ్య పనులకు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య సర్పంచులకు సూచించారు. జూపాడుబంగ్లా మండలం తూడిచెర్ల గ్రామానికి ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్‌ను అల్లూరు గ్రామంలో సోమవారం మాండ్ర శివానందరెడ్డి స్వగృహం వద్ద పూజలు నిర్వహించి ప్రారంభించారు. తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. నందికొట్కూరు పట్టణంలోని కర్నూల్ రోడ్ లో ఉన్న బైరెడ్డిరాజశేఖరెడ్డి నగర్‌లో పేదలు నిర్మించుకున్న గిడిసెలకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు నాగేశ్వరావు, భాస్కరెడ్డి, పక్కీర్‌సాహెబ్, గోపాలక్రిష్ణలు ఎమ్మెల్యే జయసూర్యకు అల్లూరులోని మాండ్ర నివాసంలో వినతి పత్రం అందజేశారు.

● నందికొట్కూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి ఘటనలు జరిగినా వెంటనే స్పందించాలని వారికి సూచించారు.

ఘనంగా ఎల్‌ఐసీ వార్షికోత్సవం

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 2: ఆత్మకూరు పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో ఎల్‌ఐసీ 68 వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 1వ తేదీ నుంచి 7వ తేది వరకు బీమా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్, ఏబీఎం విశ్వనాథ్ తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కెనరా బ్యాంక్ మేనేజర్ సూర్యదేవరనాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి బీమా వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏవో ఉమాశంకర్, డీవో జగన్నాథరాజు, ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ నాయకులు మనోజ్ కుమార్, లియాఫి నాయకులు అబ్దుల్ కరీం, స్వామిదాసు, రాంబాబు, ఉద్యోగులు విజయ్‌కుమార్, రమణయ్య, నాగన్న, అమీర్, ఇస్మాయిల్, ప్రవీణ్, ఆత్మకూరు, నందికొట్కూరు ఏజెంట్లు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

నంద్యాల (రూరల్), సెప్టెంబరు 2: దొంగతనాలకు పాల్పడుతున్న గోవిందును తాలూకా పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ అన్సార్ బాషా తెలిపారు. వైఎస్‌ఆర్ నగర్ బుడగ జంగాల కాలనికి చెందిన గోవిందు రాయమాల్‌పురం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న రూ.50 వేలు విలువ చేసే రాగి తీగలను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్లంబర్స్ అసోసియేషన్‌కు విరాళం

నంద్యాల (రూరల్), సెప్టెంబరు 2: నంద్యాల ప్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నంది గ్రూప్‌సంస్థల అధినేత సృజల రూ.లక్ష విరాళం అందజేశారు. సోమవారం ఆమె చాంబర్‌లో అసోసియేషన్ ప్రతినిధులకు చెక్కును అందజేశారు. నాయకులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగికి ఆర్థిక సాయం

మిడుతూరు, సెప్టెంబరు 2: మిడుతూరు మండలంలో హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న అంజద్‌బాషా గత శుక్రవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం మిడుతూరు గ్రామ సచివాలయ, ఇతర సిబ్బంది కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అంజద్‌బాషాను పరామర్శించారు. మండలంలో ఉద్యోగులు, ఇతర మండలాల సిబ్బంది ద్వార సేకరించిన రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

బండిఆత్మకూరు, సెప్టెంబరు 2: మండలంలోని సంతజూటూరు సొసైటీ సమీపంలోని సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. సోమవారం మధ్యాహ్నం నంద్యాల ఆత్మకూరు ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రావటంతో స్థానికులు, రహదారిలో వెళ్లే వాహనదారులు భయాందోళన చెందారు. పశువులు, కాపర్లు అటుగా వెళ్ళి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదోనన్న భయాందోళనలు స్థానికులు వ్యక్తం చేశారు.

మహిళ నేత్ర దానం


ఆదిలక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ ఇస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, డాక్టర్ మాధవీలత

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 2: నంద్యాల దేవనగర్‌కు చెందిన ఆదిలక్ష్మమ్మ అనే మహిళ సోమవారం అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం నంద్యాలలోని ప్రభుత్వాసుపత్రికి ఆసుపత్రి వచ్చారు. అయితే ఆ తర్వాత కోమాలోకి వెళ్లి మృతిచెందారు. ఆదిలక్ష్మమ్మ నేత్రాలను దానం చేయడం కోసం ఆమె కుమారులు నరేంద్ర కుమార్, నాగేశ్వరరావు రెడ్‌క్రాస్ సొసైటీని సంప్రదించారు. దీంతో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల, అర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఖండే ఆనంద్ గురూజీ, ట్రెజరర్ నాగేశ్వరావు తక్షణమే ఆసుపత్రికి వెళ్లి వైద్యులతో, ఆదిలక్ష్మమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వెంటనే రెడ్‌క్రాస్ సొసైటీ ఐ బ్యాంకు కర్నూలు టెక్నీషియన్స్ నాగన్న, ప్రదీప్ ఆదిలక్ష్మమ్మ నేత్రాలను సేకరించారు. అనంతరం నేత్రదానాలు చేసిన ఆదిలక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు జిల్లా నివారణ సంస్థ అధికారి డాక్టర్ మాధవీలత, రెడ్‌క్రాస్ సర్టిఫికెట్‌ను అందజేశారు. అనంతరం ఇద్దరికి చూపు ప్రసాదించిన ఆదలక్ష్మమ్మ కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు అభినందించారు.

నీట మునిగిన పంటలు

● అన్నదాతకు తీవ్ర నష్టం కలిగించిన వర్షాలు
● కొత్తపల్లి మండలంలోని పాలెం చెరువుకు గండి
● దెబ్బతిన్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు



కొత్తపల్లి: పాలెంచెరువుకు గండిపడటంతో వృథాగా పారుతున్న నీరు, నీట మునిగిన పంట పొలాలు


ఆత్మకూరు సమీపంలోని దుద్యాల రోడ్డులోని పంట పొలంలో నిలిచిన వర్షపు నీరు

పాములపాడు, సెప్టెంబరు 2: భారీ వర్షాల కారణంగా మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లి ప్రవహిస్తుండటంతో గ్రామీణ రహదారులు దెబ్బతిని రోడ్లు కొట్టుకుపోయి కంకర తేలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గుదవుతున్నారు. పాములపాడు నుంచి చెలిమిళ్ళ వెళ్లే రహదారిలో పొంగిన వాగుల దాటికి రోడ్లపై ప్రవహించడంతో రోడ్లు కొట్టుక పోవడంతో కంకర తేలి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. భవనాశి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఒడ్డున గల నందీశ్వరస్వామి ఆలయం నీట మునిగింది. ఇస్కాల, చెలిమిళ్ళ, ఎర్రగూడూరు, వేంపెంట గ్రామ శివార్లలో దాదాపు రెండువేల ఎకరాల్లో నీటమునిగిన పంట పొలాలు నాలుగో రోజు నీటిలోనే ఉండటంతో రైతుల తీవ్రంగా నష్టపోయారు. ఎద్దులవంక, శుద్ధవంక వాగుల పరివాహక సమీపంలోని పంటలు ఎక్కువశాతం నీటిలోనే ఉన్నాయి. ఇస్కాల గ్రామానికి కంబాలపల్లి నుండి రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. చెలిమిళ్ళ గ్రామ శివార్లలోని దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీక్రిష్ణ, ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆంజనేయ పరిశీలించారు. దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చెయ్యాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డికి సూచించారు.

● వేంపెంట గ్రామంలోని చెంచుకాలనీలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచు రామసుబ్బమ్మ కుమారుడు టేకూరి నాగేశ్వరరావు చెంచులకు ఆహారం పంపిణీ చేశారు. ముంపు బాధితులకు తమ వంతు సాయం అందిస్తున్నామని, డయేరియా బాధితులకు సంభందించి రూ.20వేల మందులు కూడా అందించినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు లెనిన్‌బాబు, రాజేష్, కృష్ణ, చిన్నస్వామి ఆచారి, నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోదనా సంస్థ శాస్త్రవేత్తల బృందం, నందికొట్కూరు వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించారు. ఏడీఏ విజయశేఖర్, ఏవో షేక్షావలి, శాస్త్రవేత్తలు సతీష్‌బాబు, వెంకటరమణ, శివరామకృష్ణయ్య, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు: వీపనగండ్లలో నీట మునిగిన పంటలను ఏడీఏ విజయశేఖర్, తహసీల్దార్ శ్రీనివాసులు, శాస్రవేత్తలు వెంటరమణ, అశోక్‌కుమార్ శివరామకృష్ణ, సతీస్‌బాబు, డీవోటీ సెంటర్ డాక్టర్ రవికిశోర్ పరిశీలించారు. వీఏఏ రాము తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామ శివారులోని పాలెంచెరువుకు సోమవారం గండి పడింది. దీంతో వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మైనర్ ఇరిగేషన్ అధికారులు తక్షణమే స్పందించి చెరువుకు గండి పడిన ప్రాంతాన్ని పూడ్చి వేసి రైతుల పంటలను కాపాడాలని గ్రామ టీడీపీ నాయకులు జానకీ రాముడు, సహదేవుడు, పోత నారాయణ, కన్నయ్య కోరారు. మండలంలో నీట మునిగిన పంటలను జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఆత్మకూరు వ్యవసాయ సంచాలకుడు ఆంజనేయ, శాస్త్రవేత్తలు రాధాకుమారి, సీనియర్ సైంటిస్టులు బాలాజీ నాయక్, విష్ణువర్ధన్ రెడ్డి, మోహన్, రవిప్రకాష్ పరిశీలించారు. ఏవో మహేష్, సిబ్బంది ఉన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో పంటలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాస్త్రవేత్తలు అశోక్‌కుమార్, శివరామకృష్ణ, వెంకటరమణ, వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి ఉన్నారు.

నంద్యాల (కల్చరల్): జిల్లాలోని వరద ప్రాంతాలను బీజేపీ నాయకుడు అభిరుచి మధు, తదితరులు పరిశీలించారు. మధు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరులో మూడురోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ఎట్టకేలకు సోమవారం తగ్గుముఖం పట్టింది. అయితే పట్టణంలోని పలు లోతట్టు కాలనీలు, పంటపొలాల్లో వర్షపునీరు నిలిచిపోయాయి. పట్టణంలోని గరీబ్‌నగర్, ఏకలవ్యానగర్, సాయిబాబానగర్, రహమత్‌నగర్, కప్పకుంట, అప్పారావువీధి, తిక్కయ్యస్వామిదర్గా, ఇందిరానగర్, ఏరాసు అయ్యపురెడ్డినగర్, అర్బన్‌కాలనీ, ఏబీఎం పాలెం, ఎస్పీజీపాలెం తదితర లోతట్టు కాలనీల్లో కొంతమేర వర్షపునీరు నిలిచిపోవడంతో ఆయా కాలనీల ప్రజలు అసౌకర్యానికి లోనయ్యారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి పలు చోట్ల వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. లోతట్టు కాలనీల్లోని వర్షపునీటిని మళ్లించేందుకు మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పట్టణ శివార్లలోని భవనాశి, పడేవాగులో నీరు ఉధృతంగా ప్రవహించింది. భవనాశి నదీ సమీపంలోని పంటపొలాల్లో వర్షపునీరు భారీగా నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే అక్కడ ఉన్న ఇటుకల బట్టీలు కూడా కొంతమేర నీటమునిగాయి. నల్లమల అటవీ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో సిద్ధాపురం చెరువులోకి వరద నీరు చేరుతోంది. అదేవిధంగా వరదరాజ స్వామి ప్రాజెక్టులోకి కూడా వర్షపునీరు వచ్చిచేరడంతో అధికారులు క్రస్టుగేట్ ద్వారా కొంతమేర నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఆత్మకూరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులు పంట నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి యు. నాగరాజు రైతులకు సూచించారు. సోమవారం ఆత్మకూరు మండలంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న తమలపాకు తోటలను ఉద్యానవన శాఖ అధికారిణి చందనతో కలిసి ఆయన పరిశీలించారు. ఏపీవో శ్రీనివాస్, ఎంపీఈవో ముర్తుజావలి, రైతులు పాల్గొన్నారు.

● కరివేన, నల్లకాలువ, కొత్తరామాపురం, వడ్లరామాపురం గ్రామాలలో నీట మునిగిన మొక్కజొన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఏడీఏ ఆంజనేయ, వ్యవసాయ శాస్త్రవేత్తలు రాధాకుమారి, బాలాజి నాయక్,మోహన్, రవిప్రకాష్ రెడ్డి, ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సుధాకర్ జిల్లా వ్యవసాయాధికారిని కోరారు.

బండిఆత్మకూరు: రైతు సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్మిక సంఘం నాయకుడు రత్నమయ్య, వ్యకాస నాయకులు డేవిడ్, రామచంద్రుడు బండిఆత్మకూరు వద్ద నీట మునిగిన వరినాట్లను పరిశీలించారు.

వెలుగోడు: మండలంలో దెబ్బతిన్న పంటలను ఏవో పవన్‌కుమార్ పరిశీలించారు. సిబ్బంది రామకృష్ణ, వెంకట శివ, లక్ష్మానాయక్ ఉన్నారు.

మహానంది: మండలంలోని తమ్మడపల్లి పొలాల్లోని వరి పంటను ఏవో బి.నాగేశ్వర‌రెడ్డి పరిశీలించారు. గ్రామ వ్యవసాయాధికారి మధు ఉన్నారు. ఇ.బొల్లవరం ప్రధాన రహదారి కుంగి పోయింది. గ్రామం ప్రారంభంలో ఉండే దళితకాలనీలోని వ్యవసాయ బావి కొంత భాగం లోనికి కుంగిపోయింది. దీంతో బావి పక్కనే ప్రధాన రహదారి ఉండటంతో అది కూడా కొంత భాగం కుంగిపోయింది. దీంతో ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.


శాతనకోటలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు


ఇ. బొల్లవరంలో కుంగిపోయిన ప్రధాన రహదారి


చెలిమిళ్ళ గ్రామ శివారులో నీటమునిగిన పంట పొలాలు

ఘనంగా డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు


నందికొట్కూరులో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


నంద్యాలలో అన్నదానం చేస్తున్న తులసిరెడ్డి, నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 2: చాబోలులో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఉర్దూ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పేద కుంటం బాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. జనసేన సమన్వ యకర్త సుధాకర్ రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. టీడీపీ నాయకులు ఇలియాస్, గుర్రప్ప, జనసేన రాయలసీమ కమిటీ మెంబర్ సందీప్, నాగార్జున పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకులు సుందర్, చందు, గురుబాబు, చంద్ర మురళి ఆధ్వర్యంలో నంద్యాలలోని జనసేన కార్యాలయంలో కేక్ కట్ చేశారు. తలసేమియా చిన్నరులకు, గర్భిణుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక కార్యాలయ ఆవరణలో అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రథమ నంది దేవస్థానం ఆవరణలలో మొక్కలు నాటారు.

గోస్పాడు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా సోమవారం గోస్పాడులో జనసైనికులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు బోయ రమేష్, దస్తగిరి, సురేష్‌తో పాటు వెంకి, నాగేంద్ర, మౌళాలి, గోకారి, అన్వర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. జనసేన ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు. టీడీపీ నాయకులు ముర్తుజావళి, జనసేన నాయకులు రామిరెడ్డి, మధు, సంపత్ పాల్గొన్నారు.

పాములపాడు: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పాములపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మొక్కలు నాటారు. పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు. మిట్టకందాల, బుద్దానగర్ గ్రామాలలో బావన రాము ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

మిడుతూరు: వీపగండ్లలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్, టీడీపీ నాయకుడు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం భారీ వర్షాలకు ఇంటి మెత్తు కూలిపోయిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. జనసేన నాయకులు కరుణాకర్ పాల్గొన్నారు.




శ్రీశైలం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకుని సుండిపెంట గ్రామంలో "క్లీన్ ఆంధ్ర.. గ్రీన్ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలో జరిగిన ఈ వనమహోత్సవం కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, శ్రీశైలం సీఐ ప్రసాదరావు, అటవీశాఖ రేంజర్ నరసింహులు, ఐటీఐ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీను, కూటమి నాయకులు మొక్కలను నాటారు. జనసేన నాయకుడు వడ్డేటి బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వనమహోత్సవం బస్టాండ్ సర్కిల్‌లో కూటమి నాయకులు కేక్ కట్ చేశారు.

వెలుగోడు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను గుంతకందాలలో, వెలుగోడులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వేర్వేరుగా కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. గుంతకందాలలో రూ.5 వేలు చొప్పును ఇద్దరు పేద మహిళ కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమాల్లో మల్లికార్జున, లక్ష్మణ నాయక్, నగేష్, కిరణ్‌కుమార్ నాగ తేజ, ఖలీల్, అమీర్‌హంజా, షాలు బాషా, వలి, సుకన్య పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరీదేవి కళ్యాణ మంటపంలో కాపు బలిజ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ఏకనాథం, కొండనారాయణ, మారుబోతుల స్వామి, రామసుబ్బయ్య, శ్రీరాములు, సత్యనారాయణ, శ్రీనాథ్, జనసేన పార్టీ నాయకులు శేషకుమార్, హరీష్, శ్రీనివాసులు కేక్ కట్ చేశారు. అనంతరం జనసేన పార్టీలో చురుకైన పాత్ర పోషించిన కార్యకర్తలను శాలువాతో సత్కరించారు.

పాణ్యం: జనసేన మండల కన్వీనర్ జగదీశ్ బాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేశారు. నాయకులు సుభాన్, కిషోర్, సుబ్బకృష్ణ, కమ్మయ్య, వేణుగోపాల్, కర్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడివేముల: కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ చింత సురేష్‌బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జనసేన మండల నాయకులు ధరణి చంద్రమోహన్, మహమ్మద్‌రఫి, టీడీపీ మండల కన్వీనర్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. జనసేన నాయకులు సుబ్బయ్య, మంజునాథ్, టీడీపీ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.




నంద్యాలలో కేక్ కట్ చేస్తున్న ఫిరోజ్, గడివేములలో పాల్గొన్న సురేష్‌బాబు, సుండిపెంటలో మొక్కను నాటుతున్న నాయకులు

వైఎస్సార్‌కు ఘన నివాళి


నల్లకాల్వ సమీపంలోని స్మృతివనంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 2: నల్లకాల్వ గ్రామ సమీపంలోని స్మృతివనంలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని వర్ధంతిని నిర్వహించారు. వైసీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైసీపీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, కరివేన సురేష్ మారుబోతుల విజయ్, సాజిద్‌బాషా తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని పాత బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. వైసీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, ఎక్కలదేవి చంద్రమౌళి, శ్రీనివాసులు, చింతా విజ్జి, మార్కెట్ రాజు, జగన్, రఫి, వెంకటస్వామి, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. వైసీపీ జిల్లా ప్రధానకార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు వైవీరమణ, తరుణ్‌కుమార్‌రెడ్డి, దినేష్, లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, సెప్టెంబరు 2: రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. వర్షాలపై గడివేముల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల సంభవించిన నష్టాలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉండటంతో పశు, పంట నష్టం జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సురక్షిత మంచి నీటిలో మురుగు నీరు కలవకుండా లీకేజీలను అరికట్టాలని అన్నారు. రైతులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి 6 ఇళ్లు పాక్షికంగా, ఒక ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. దెబ్బతిన్న ఇళ్లకు పక్కా ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బిలకలగూడురు గ్రామంలో కొళాయిలకు నీళ్లు రావడం లేదని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ గ్రామ టీడీపీ నాయకులు ఎస్‌ఏ రఫిక్, సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. బిలకలగూడురు గ్రామంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ బీవీఎన్ విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి హేమసుందర్ రెడ్డి, మండల అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పంట రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానం అమలు చేయాలి'

గోస్పాడు, సెప్టెంబరు 2: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు డిమాండ్ చేశారు. సోమవారం గోస్పాడులో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని చూస్తున్న జీపీఎస్, యూపీఎస్ విధానాలను విరమించుకోవాలని అన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయులను నియమించాలని, పదోన్నతులు చేపట్టాలని అన్నారు. పీఆర్‌టీయూ నాయకులు నరసింహారెడ్డి, సురేష్‌కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

'నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేయాలి'

నందికొట్కూరు, సెప్టెంబరు 2: జూపాడుబంగ్లా కేసీ కెనాల్ వద్ద వినాయక నిమజ్జన ప్రాంతంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఆ ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. అక్కడ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని, నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గజ ఈతగాళ్లను నియమించాలని, క్రేన్ ఏర్పాటు చేయాలని జూపాడుబంగ్లా ఎస్‌ఐ లక్ష్మీనారాయణను కోరారు.

'గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిద్దాం'

నంద్యాల రూరల్, సెప్టెంబరు 2: వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరం కృషి చేద్దామని ఎంపీడీవో సుగుణశ్రీ పిలుపు నిచ్చారు. సోమవారం నంద్యాల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల ప్రభుత్వ ఉద్యోగులు, మండపాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'చెరువులను కాపాడాలి'

పాములపాడు, సెప్టెంబరు 2: మిట్టకందాల గ్రామంలోని కుంటలు, చెరువులు ఆక్రమణకు గురయ్యాయని వీటిపై విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రేమరాజు, శేషశయనారెడ్డి, చంచలరాజు, చిన్న వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఈ భూములపై రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే చేపట్టాలని కోరారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మొక్కజొన్న సాగులో జాగ్రత్తలు పాటించాలి


మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో నిరంజన్, సిబ్బంది

కోవెలకుంట్ల, సెప్టెంబరు 2 : ఇటీవల కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించి అధిక దిగుబడులు సాధించుకోవాలని కోవెలకుంట్ల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. మొక్కజొన్న పంటలో అధికంగా నీరు ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 2 : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎస్ఐ మాట్లాడుతూ మట్కా, పేకాట వంటివి నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

రుద్రవరం, సెప్టెంబరు 2 : రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని తహసీల్దారు మల్లికార్జునరావు, ఏవో శ్రీకృష్ణ అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సంయుక్త సమావేశం నిర్వహించారు. 21500 ఎకరాల్లో 10500 ఎకరాలు పంట నమోదు చేయడం జరిగిందన్నారు. మిగిలిన పంట నమోదును కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.

వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలి

రుద్రవరం, సెప్టెంబరు 2 : మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని చేయాలని ఎంపీడీవో మధుసూదనరెడ్డి, ఈవోపీఆర్‌డి శ్రీనివాసశర్మ సోమవారం గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతి నెలలో 2, 17వ తేదీల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడేని పాటించాలన్నారు. మట్టిమిద్దెలలో నివశించే వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

క్రీడా మైదానాల్లో పిచ్చి మొక్కల తొలగింపు

రుద్రవరం, సెప్టెంబరు 2 : మండలంలోని ఆదర్శ పాఠశాల క్రీడామైదానంలో సోమవారం పిచ్చిమొక్కలు తొలగించినట్లు సోమవారం ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, విద్యాకమిటీ కమిటీ చైర్మన్ ప్రసాద్ తెలిపారు. ముళ్లచెట్లు తొలగించేందుకు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం అందించినట్లు తెలిపారు.

'సర్పంచ్ నిధులు మాయం చేశారు'

డోన్(రూరల్), సెప్టెంబరు 2: గత వైసీపీ ప్రభుత్వంలో సర్పంచుకు సంబంధించిన నిధులను మాయం చేసేశారని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో సర్పంచు నిధులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి సంబంధించిన మోటార్లకు మరమ్మతులు చేయాలన్నా, పారిశుధ్య నిర్వహణ చేయాలన్నా నిధులు లేక సర్పంచులు అల్లాడిపోయారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ సర్పంచుల నిధుల మళ్లింపు మాయంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి గ్రామాల సర్పంచులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న మండల, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

డోన్(రూరల్), సెప్టెంబరు 2: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పల్స్ సర్వేను నిర్వహించాలన్నారు. పల్స్ సర్వేలో కొళాయి కనెక్షన్లు ఎన్ని ఉపయోగంలో ఉన్నాయి.. నిరూపయోగంలో ఎన్ని ఉన్నాయని.. పైపులైన్ల పరిస్థితి ఏ విధంగా ఉందని తదితర సమాచారాన్ని అందజేయాలన్నారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు


డీఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లికార్జున

డోన్, సెప్టెంబరు 2: డోన్ డీఎస్పీ శ్రీనివాసులును సోమవారం టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున, పాల్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులుకు వారు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

గాడుబావి ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల, సెప్టెంబరు 2: పట్టణ శివారులోని కులుముల పల్లె రస్తాలో గాడుబావి సమీపంలో వెలసిన ఆంజనేయస్వామికి భక్తులు శ్రావణమాసం చివరి సోమవారం అమావాస్య పూజలు నిర్వహించారు. సోమవారం ఆంజనేయస్వామికి కుంకుమార్చన, ఆకుపూజలు నిర్వహించారు.

రైతుల సంక్షేమం కోసమే జల హారతులు


అభిరెడ్డిపల్లె చెరువు జలహారతిలో పాల్గొన్న భక్తులు, పురోహితులు

డోన్(రూరల్), సెప్టెంబరు 2: రైతుల సంక్షేమం కోసం మండలంలోని అభిరెడ్డిపల్లె గ్రామ చెరువులో గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పురోహితులు గణపతి పూజ, జలహారతులను నిర్వహించారు. శ్రావణ మాసం చివరి సోమవారం, అమావాస్య ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శతావధాని దత్తాత్రేయ శర్మ, పురోహితులు కల్లె శేషావలి శర్మ, గంగాదర శాస్త్రి, భాస్కర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఏడుగురికి గాయాలు

చాగలమర్రి, సెప్టెంబరు 2: చాగలమర్రి గ్రామంలోని 40వ జాతీయ రహదారిపై తిరుమల నుంచి హైదరాబాదుకు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని సోమవారం తెల్లవారుజామున బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. కారులో ఉన్న పవన్, మల్లయ్య, మల్లేష్‌లతో పాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

బేతంచెర్ల, సెప్టెంబరు 2: మండలంలోని బలపాలపల్లి గ్రామానికి చెందిన ముద్దవరం మనోహర్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన రుద్రవరం సుంకన్న అనే వ్యక్తి పాతకక్షలను మనసులో పెట్టుకుని కట్టెలతో కొట్టి దాడిచేశాడని హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం తెలిపారు.

రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకం

- ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు
- జిల్లాల్లో రక్తదాన శిబిరాలు

డోన్, సెప్టెంబరు 2: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవడం స్ఫూర్తిదాయకమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సూచించారు. సోమవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణంలోని లక్ష్మి ఫంక్షన్ హాలులో జనసేన నాయకులు బ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కోట్ల ప్రారంభించారు. అదే విధంగా సాయి ఫంక్షన్ హాలులో జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బర్త్‌డే కేకును కట్ చేశారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగంలో పవన్ కళ్యాణ్ ప్రజల పక్షాన ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. పనవ్ కళ్యాణ్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని జనసైనికులు రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. అలాగే పాతబస్టాండులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, సీనియర్ న్యాయవాది భాస్కర్ రెడ్డి, కటారుకొండ వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్, సందు వెంకటరమణ పాల్గొన్నారు.

● పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టన్న, మాజీ సర్పంచ్ రాముడు, జనసేన నాయకులు లాల్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి రావడానికి పవన్ కళ్యాణ్ కృషి

ఆళ్లగడ్డ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడులను జనసేన పార్టీ ఇన్‌చార్జీ మల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం జరిగాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆమె భర్త బార్గవ్‌రామ్‌నాయుడు హాజరై కేక్ కట్ చేసి, రక్తదానం చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు నల్లగట్ల బాలుడు, డాక్టర్ ఎంవిప్రసాద్, టీడీపీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు బనగానపల్లె నియోజకవర్గం జనసేన కోఆర్డినేటర్ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకు లుగురప్ప, నాగప్రసాద్, కిట్టు, విజయ్ ఘనంగా మొక్కలు నాటి రక్తదానం నిర్వహించారు. కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటి కార్యక్రమం చేపట్టి అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రసాద్, షేక్షావలి, నాగేశ్వర్‌రావు, చంద్రశేకర్, గురప్ప, నరసింహ, రమేశ్, ప్రభాకర్, మనోహర్, మనోహర్‌రెడ్డి మురళి, నాగేంద్ర, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, పవన్ అభిమానులు కక్ కట్ చేసి పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మధుకుమార్, కొంగనపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను జనసేన మండల అధ్యక్షులు గుజ్జల పెద్దయ్య, ఇతర నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, టీడీపీ ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి, జనసేన ప్రతాప్, పృథ్వీ, రమణ, రామమూర్తి, రమేష్‌రెడ్డి, సురేష్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో నాయకులు మొక్కలు నాటారు. అనంతరం రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ జనసేనా పార్టీ యువనాయకుడు ఇరిగెల జయేంద్రారెడ్డి, జనసేనా పార్టీ మండల అధ్యక్షుడు డీకే బాబు, మండల జనసేనా నాయకులు అబ్దుల్, సుబ్బరాయుడు, జయచంద్ర, సుజేయుడు, చింత పవన్, అబ్దుల్లా, మధు, సురేష్, మాబుహుస్సేన్, డేవిడ్, రంగస్వామి, సాగేంద్ర పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు జనసేనపార్టీ నాయకులు భాస్కర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏర్పాటు చేసిన రక్తదానశిబిరాన్ని బీసీ ఇందిరమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య, ఉపసర్పంచ్ బురానుద్దీన్, నాగేంద్రారెడ్డి, ఖాదర్, జనసేన పార్టీ నాయకులు మెహబూబ్, రాఘవేంద్ర, మహమ్మద్, కిరణ్, మధు, శ్రీకాంత్,గురప్ప, హుసేన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. బనగానపల్లె ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కట్లు బనగానపల్లె సీఐ కృష్ణయ్య యాదవ్ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, జనసేన పార్టీ నాయకులు భాస్కర్, మహబూబ్, రాజు, కాశీం,రామకోటి, వినయ్, మహేశ్, అనిల్‌కుమార్, సాయితేజ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. అలాగే నందవరంలో జనసేన పార్టీ నాయకులు పవన్‌కళ్యాన్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటారు.

బేతంచెర్ల: యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీస్ పెరేడ్ ప్రాంగణంలో జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన మండల నాయకులు శ్రీకంటి మధు, లైఫ్ రక్తసహాయ బృందం లైఫ్ యువ నేత్ర సేవా సమితి లెవెగ్ ప్రైవేటు కంపెనీ నాయకులు సౌజన్యంతో జనసేన పార్టీ నాయకులు మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. 208 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో కోట్ల అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరావు, చంద్రశేఖర్, సుధాకర్; తిరుమలేష్ చౌదరి, నారాయణస్వామి, జనసేన మండల నాయకులు రాజశేఖర్, పోల మధు, రాజేష్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గౌరి హుశేన్ రెడ్డి, టీడీపీ, జనసేన కార్యకర్తలు యువత పాల్గొన్నారు.

రుద్రవరం, సెప్టెంబరు 2 : రుద్రవరంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల్లో జనసైనికులు పవన్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో భరత్‌కుమార్‌రెడ్డి, జయచంద్రరెడ్డి, డేవిడ్, బండల శ్రీను, దస్తగిరి, ఓబులయ్య , సురేశ్, గురుప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి


పవన్ అభిమానులకు కేక్ తినిపిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి


ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ


బనగానపల్లెలో రక్తదాన శిబిరం ప్రారంభించి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సతీమణి బీసీ ఇందిరమ్మ


ఉయ్యాలవాడలోని ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటుతున్న నాయకులు

తెలుగుగంగ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


నల్లమలలో తెలుగుగంగ ప్రధాన కాల్వ గట్టు వెంట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రుద్రవరం, సెప్టెంబరు 2 : తెలుగుగంగ కాల్వలు, శ్రీరంగాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం మండలంలోని శ్రీరంగాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకును తెలుగుగంగ ప్రధాన కాల్వపై తూము ఏర్పాటు చేయడానికి స్థలాన్ని పరిశీలించారు. అటు మైనర్ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, తెలుగుగంగ డీఈలను వివరాలతో పాటు నివేదికలు ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్లెదుటే నీరు పారుతున్నా మన ప్రాంత రైతులకు సాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు. మన రైతులు మన రాష్ట్రం రైతులు వాడుకున్నాకే చెన్నైరాష్ట్రానికి నీళ్లు వదులుదాం, అడ్డుకోవడానికి నేను ముందుంటా, గట్టిగా అడుగుతా అని రైతులకు హామీ ఇచ్చారు. రాయలసీమ ఫ్యాక్షన్ కోరల్లో, కరువు కాటకాల్లో ఉన్నప్పుడు తెలుగుగంగ ప్రధాన కాల్వను నందమూరి తారకరామారావు నిర్మాణం చేశారు. రాయలసీమ కాదు ఈ ప్రాంతానికి వస్తే కోస్తాలో ఉన్నట్లు అనిపిస్తుంది. రైతుల విన్నపం మేరకు తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి 17వబ్లాక్ ఛానెల్ లెవెల్ ఎత్తించి సాగునీరందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ పని విజయవంతం కాకపోతే తెలుగుగంగ ప్రధాన కాల్వ గట్టుకు మరో తూము ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏడాదిన్నరలోపు ఆళ్లగడ్డప్రాంతంలో తెలుగుగంగ ఉప కాల్వలు, కాల్వలు పూర్తి చేయిస్తామన్నారు. కాల్వల నిర్మాణంపై ఈఎన్‌సీ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి వారితో చర్చిద్దామన్నారు. ఇప్పటికే నిధులు మంజూరయ్యాయి, టెండర్లు ఎలా పిలవాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలో ఉన్నారన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు అందుబాటులోకి తెస్తాం

1997లో నిర్మాణం ప్రారంభమైన శ్రీరంగాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకును తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చి రెండు మండలాల్లోని 7 నుంచి 10 గ్రామాల ప్రజలకు సాగునీరందిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఈ పథకం 1997లో నిలిచిపోయిందన్నారు. 2013లో మా అమ్మ అప్పటి ఎమ్మెల్యే శోభా నాగిరెడ్డి రూ.6 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఆ పనులు చేయిద్దామనేసరికి అప్పట్లో ప్రభుత్వం మారింది. వైసీపీ నాయకులు ఐదేళ్ల పరిపాలనలో సాగునీటి సంఘ సలహాదారులుగా, ఎమ్మెల్యేలుగా ఉన్నా గ్రామాలకు చేసిందేమీ లేదని, వైసీపీ పాలనలోనే సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు గండిపడిందన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నిర్మించిన భవనాలకు కూడా కిటికీలు, తలుపులు మోటర్లు చోరీకి గురయ్యాయన్నారు. వాటిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ప్రభుత్వ నిధులు మంజూరు కావడం ఆలస్యమైతే.. సొంత నిధులతోనే గండిని పూడ్చి నీరు నింపుతామని ఎమ్మెల్యే ప్రజలు, రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు మల్లిఖార్జునరావు, ఎంపీడీవో మధుసూదనరెడ్డి, టీడీపీ నాయకులు ఎల్‌వీ రంగనాయకులు, సర్పంచ్ సుబ్బమ్మ, మాజీ సర్పంచ్ నంద్యాల నారాయణ రెడ్డి, యల్లావత్తుల సర్పంచ్ చంద్రమోహన్ , కుమ్మరి వెంకటపతి, సత్యం రాజు, అల్లాడి చంద్రశేకర్, యడవల్లి శ్రీనివాసులు, రామనాధరెడ్డి, మాజీ సర్పంచ్‌యర్రంప్రతాప్‌రెడ్డి, లక్ష్మీకాంత్, డీలరు నరసింహారెడ్డి, డీఈలు చంద్ర ఓబుల్‌రెడ్డి, గురుమూర్తి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఐ, నాయకులు

బనగానపల్లె , సెప్టెంబరు 2: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బనగానపల్లె సీఐ కృష్ణయ్యయాదవ్ కోరారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ ఉత్సవ కరపత్రాన్ని సీఐకి అందించారు. గణేశ్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షుడు మల్లారెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, లాయర్ నాగేంద్రారెడ్డి, కోడి నాగేశ్‌బాబు, తదితరులు సీఐని కలసి గణేశ్ ఉత్సవాల గురించి వివరించి నిమజ్జనం గురించి, గణేశ్ ఉత్సవ ఏర్పాట్లను వివరించారు. ఉత్సవాల సందర్భంగా పోలీసులు తమకు సంపూర్ణ సహకారాలు అందించాలని కమిటీ సభ్యులు కోరారు. సీఐ మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు కలసికట్టుగా ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా తాము అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో టీచర్ నాగరాజు, ప్రతాప్, కాసుల జంగంశెట్టి, వ్యాపారి వంకదారి శేష ప్రసాద్, ఖాదర్, యాగంటిపల్లె నాగేశ్వరరెడ్డి, బలరాముడు యాదవ్, మనోహర్, ప్రతాప్, బింగిమళ్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : ప్రతి ఒక్కరూ గణపతి ఉత్సవాలకు అనుమతి తీసుకోవాలని కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు అన్నారు. సోమవారం కొలిమిగుండ్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనుమతి తీసుకోవడం ద్వారా విగ్రహాలపై పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. నిమజ్జనం సమయంలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా చిన్న పిల్లలు, వృద్ధులను దూరంగా ఉంచాలన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం


మీర్జాపురంలో కొనసాగుతున్న శ్రీకృష్ణ గ్రామోత్సవం


వేడుకలో భక్తులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 2 : మండలంలోని మీర్జాపురం గ్రామంలో ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక త్రైతసిద్ధాంత కమిటీ సభ్యులు మహమ్మద్ హుసేన్ నాయుడు, రామక్రిష్ణారెడ్డి, బాలు, భూపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి ప్రతిమకు గ్రామోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పల్లకీ ఉత్సవానికి భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోరెడ్డి చిన్నపురెడ్డి, గ్రామ పెద్దలు పోరెడ్డి మధుసూధన్‌రెడ్డి, టైలరు దస్తగిరి, జయచంద్రారెడ్డి, నత్తిరామచంద్రుడు, మార్కె శ్రీరాములు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోటల్ వీరన్న మృతికి బీసీ రాజారెడ్డి సంతాపం

బనగానపల్లె , సెప్టెంబరు 2: బనగానపల్లె పట్టణ నివాసి హోటల్ వీరన్న (76) గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని మాజీ సర్పంచ్ బీసీరాజారెడ్డి అన్నారు. సోమవారం బస్టాండ్ ఎదురుగా ఉన్న హోటల్ వీరన్న మృతదేహానికి నివాళుర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే బట్టల శ్రీనివాసులు, రాయలసీమ సలాం, తదితరులు వీరన్న మృతికి నివాళులర్పించారు.

పండుగ ఉత్సవాలను కలిసికట్టుగా జరుపుకోవాలి


ఏనుగమర్రిలో కృష్ణుడి పల్లకి మోస్తున్న రైల్వే ఎస్పీ

ప్యాపిలి, సెప్టెంబరు 2: పండుగ ఉత్సవాలు అందరూ కలసి కట్టుగా జరుపుకోవాలని గుంతకల్లు రైల్వేశాఖ ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. మండలంలోని ఏనుగమర్రి గ్రామంలో సోమవారం నిర్వహించిన కృష్ణ భగవాన్ గ్రామోత్సవంలో ఆయ న పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో కుల మతలాకు అతీతంగా కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం ఎస్పీ భక్తులతో కలిసి కృష్ణుడి పల్లకి మోశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాద్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మోపూరి రామక్రిష్ణ, ఖాజాపీర, గండికోట రామసుబ్బయ్య, మర్రి రమణ, ఆలా మోహన్‌రెడ్డి, రాంభూపాల్ సేవా సమితి సభ్యులు రమేష్ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం


మాట్లాడుతున్న గౌడ సంఘ అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, సెప్టెంబరు 2: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని కొత్తగా ఏకగ్రీవంగా ఎంపికైన చాగలమర్రి మండల గౌడ సంఘ అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. సోమవారం మండల గౌడ సంఘ కార్యవర్గ ఎన్నిక ఆళ్లగడ్డ తాలుక గౌడసంఘ అధ్యక్షుడు చిన్న రమణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడుతూ గౌడ సంఘ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘ ఉపాధ్యక్షుడు చక్రపాణి, చిన్న నరసింహులు, కార్యదర్శి ఆర్.చక్రపాణి, కోశాధికారి వెంకటరమణ, కమిటీ సభ్యులు గోవర్ధన్, పవన్, సందిప్, హరిగౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతులకు పూజలు


బుగ్గమల్లేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, సెప్టెంబరు 2: చాగలమర్రి గ్రామంలోని బుగ్గ మల్లేశ్వర ఆలయంలో సోమవారం శ్రావణమాసం ముగింపు, అమవాస్య సందర్భంగా వేద పండితుడు పెద్ద శాస్త్రీ ఆధ్వర్యంలో శివపార్వతులకు జల, క్షీరాభిషేకాలు చేశారు. గణపతి హోమం, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా పార్వతిదేవికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు.

టీబీ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం


టీబీ వ్యాధి నివారణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చాగలమర్రి, సెప్టెంబరు 2: గ్రామాల్లో టీబీ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ సబ్ యూనిట్ టీబీ సూపర్‌వైజర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రిగ్రామంలోని 4, 1 సచివాలయాల పరిధిలో వేస్తున్న టీబీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం టీబీ వ్యాధి నివారణ కోసం ప్రత్యేక దృష్టి ఉంచిందని అన్నారు. 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు పైబడిన వారందరికి బీసీజీ టీకాలు వేస్తున్నామని తెలిపారు. వ్యాధి నివారణ కోసం బీసీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఉన్నారు.

కలుషిత నీరు, ఆహారంతో డయేరియా


కాదరబాదరలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శిరివెళ్ల, సెప్టెంబరు 2 : కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా ప్రజలు డయేరియా(అతిసారం) బారిన పడతారని వైద్యులు దివ్య, ముఖేష్ కుమార్, సీహెచ్‌వో రామ్మో హన్‌రెడ్డి తెలిపారు. మండ లంలోని కాదరబాదర గ్రామంలో ప్రజలు, చిన్నారులకు సోమ వారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం శిరివెళ్లలోని మోడల్ స్కూల్‌లో డయేరియా గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిస రాల పరిశుభ్రతను పాటిస్తూ నీరు, ఆహారం కలుషితం కాకుండా చూసుకో వాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ రవి కిషోర్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణ సేవలు మరువలేనివి


రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతు సంఘం, సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల, సెప్టెంబరు 2: రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. రామకృష్ణ సేవలు మరువలేనివని, ఆయన అడుగుజాడల్లో రైతాంగం నడవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని సీఐటీయు కార్యాలయంలో రైతు సంఘం కార్యదర్శి రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతుల కోసం ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నీలి వెంకట కృష్ణారెడ్డి, బాలశేఖర్, గోరంట్ల, వెంకటసుబ్బయ్య, అనిల్, కలాం, రామచంద్రుడు, రైతులు కార్మికులు పాల్గొన్నారు.